క్లుప్తంగా

'రాజీవ్ యువ వికాసం' ప్రారంభంపై హర్షం

మల్హర్: నిరుద్యోగ యువకులకు చేయూత అంశంలో భాగంగా సోమవారం అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభించడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేశ్ ఒక ప్రకనటలో పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా సుమారు 5లక్షల మంది నిరుద్యోగ యువత కోసం రూ.6వేల కోట్ల రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం సమాచార హక్కు చట్టం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ బహూకరించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లుగౌడ్ మాట్లాడుతూ.. పిల్లలు చక్కగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు పోషయ్య, మండల కమిటీ సభ్యులు బండారు కుమార్‌యాదవ్, రమేశ్, సమ్మయ్య, ఉపాధ్యాయులు భాగ్యశ్రీ, వెంకన్న, సురేందర్, కల్యాణి, అనిల్ కుమార్, రాజు, కుమారస్వామి, ప్రవీణ్, పద్మ, లలిత, విజయభాస్కర్, రాజయ్య, శ్రీకళ, చందర్ పాల్గొన్నారు.

కుష్ఠు లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలి

పలిమెల: కుష్ఠు లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలని అంబటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కల్యాణ్ గ్రామస్తులకు తెలిపారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అంబటిపల్లి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో నిర్వహించనున్న ఇంటింటి సర్వేలో భాగంగా మండల కేంద్రంలోని పలిమెల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో సందర్శించి సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధి లక్షణాలైన ముఖంపై నూనె పోసినట్లు మెరుస్తూ ఉండటం, అరికాళ్లు, అరచేతుల్లో తిమ్మిర్లు రావడం, పట్టు సడలకడం, కనురెప్పలు సరిగ్గా మూసుకోకపోవడం, అరిపాదం సరిగ్గా పైకి లేవకపోవడం, చెవుల దిమ్మలు లావెక్కడం, దద్దుర్లు రావడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే సర్వేకు వచ్చే ఆరోగ్య సిబ్బందికి తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సోనాజీ, లక్ష్మి, సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



మొగుళ్లపల్లి: చిట్యాలలో హోంగార్డుగా విధులు నిర్వహించే మండల కేంద్రానికి చెందిన మెట్టుపల్లి రాజయ్య తండ్రి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని తోటి హోంగార్డులు సోమవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డుల సంఘం జిల్లా అధ్యక్షుడు రావుల మొగిలి, ప్రధాన కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్, గౌరవ అధ్యక్షుడు ముత్యాల మొగిలి, కోశాధికారి మేడిపల్లి శ్రీనివాస్, హోంగార్డులు గంగరాజు రవీందర్ రమేశ్, దేవేందర్, రామస్వామి, ప్రసాద్, రఘు, రాకేష్, శంకర్, కుమార్, చందు వెంకటేశ్ పాల్గొన్నారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

కాటారం: మండల కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడగా సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. బోల్లు రమేశ్ ప్లాస్టిక్ సామగ్రి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి తీర్థయాత్రల పర్యటన నిమిత్తం వెళ్లారు. సోమవారం తిరిగి ఇంటికి చేరుకొని ఇంట్లోకి వెళ్లగా ఇంటి వెనక డోర్ పగలగొట్టి దొంగలు ఇంట్లోకి ప్రవేశించినట్లు ఆనవాళ్లు గుర్తించారు. బీరువా డోర్ తెరిచి రూ.15 వేల నగదు, రెండు చెవి కమ్మలు ఎత్తుకెళ్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఆదర్శనగర్ కాలనీ కన్వీనర్ ఆత్మకూరి కుమార్ చోరీని పరిశీలించారు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వజ్రోత్సవాలను విజయవంతం చేయాలి

ఏటూరునాగారం: వజ్రోత్సవాలను పూర్వ విద్యార్థులు విజయవంతం చేయాలని వజ్రోత్సవాల కన్వీనర్ ఇర్సవడ్ల వెంకన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో 1982–83 బ్యాంచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళన కోసం రూ.1లక్ష కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 3, 4 తేదీల్లో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో వజ్రోత్సవవేడుకలను నిర్వహించుకునేందుకు అన్ని వర్గాలకు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, చందు, నూక ప్రభాకర్, అశోక్, మల్లారెడ్డి, రఘు, రమేష్, శంకర్, సుధాకర్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చౌరస్తా

చిట్యాలలో నిత్యం రోడ్డు ప్రమాదాలు

● ఏర్పాటు చేయని సూచిక బోర్డులు



చౌరస్తా వద్ద వెళ్తున్న వాహనాలు

చిట్యాల: మండల కేంద్రంలోని మార్కెట్ సమీపంలో నాలుగు ప్రధాన రహదారుల వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా అధికారులు విఫలం అవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కనీసం మలుపు వద్ద సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. మండల కేంద్రం నుంచి భూపాలపల్లికి వెళ్లే ప్రధాన రహదారి, టేకుమట్ల నుంచి పరకాలకు వెళ్లేందుకు నిత్యం అనేక మంది ప్రయాణికులు ఇదే దారి నుంచి ప్రయాణిస్తారు. నాలుగు రహదారుల కూడలి సమీపంలో పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, మండల సమైఖ్య కార్యాలయాలు ఉండడంతో పాటు పక్కనే బాలికల గురుకుల పాఠశాల ఉంది. ప్రతీ రోజు ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు నిత్యం ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలపై ప్రయాణం చేస్తుంటారు. నాలుగు కూడలిలలో ఏలాంటి సూచిక బోర్డులు, డివైడర్లు లేకపోవడంతో తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం సైతం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. వాహనదారుడికి హెల్మెట్ ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డివైడర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలోని మార్కెట్ సమీపంలో ఉన్న చౌరస్తా వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిత్యం ఈ దారి గుండా వ్యవసాయ పనులకు రైతులు వెళ్తుంటారు. నాలుగు రహదారులు ఉండడంతో ఏటువైపు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి. సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– రవీందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, చిట్యాల

ప్రమాదాలను నివారించాలి



మండల కేంద్రంలోని నాలుగు కూడలిల వద్ద ప్రతీ నిత్యం ఏదో ప్రమాదం జరుగుతునే ఉంది. అధికారులు త్వరితగతిన స్పందించి నాలుగు కూడలీల వద్ద ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టాలి.

– సత్యనారాయణ, వాహనాదారుడు, రాంచంద్రాపూర్

అనుమానితులను గోదావరి దాటించొద్దు

● ఎస్సై రమేశ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

పలిమెల: కొత్తవారిని, అనుమానాస్పద వ్యక్తులను గోదావరి దాటించొద్దని ఎస్సై రమేశ్ పడవలు నడిపే వారికి, ప్రజలకు సూచించారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా సోమవారం మండలంలోని బూరుగుగూడెంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామంలోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మావోయిస్టులకు సహకరించిన, ఆశ్రయం కల్పించినా చట్టరీత్యా నేరమన్నారు. అలాగే గుడుంబాకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గుడుంబా అమ్మినా, తయారు చేసిన, సరఫరా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

చిట్యాల: ఆశకార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్‌కు సోమవారం ఆశ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశకార్యకర్తలు మానస, విజయ, స్రవంతి, రమ, లావణ్య మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ నెల 21న పీహెచ్‌సీ, సబ్ సెంటర్ల ముందు ప్ల కార్డ్స్‌తో నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే 24న ఛలో హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా ఉంటుందని తెలిపారు. తమ సమస్యలపై తలపెట్టిన నిరసనకు పర్మిషన్ ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు.

ఎన్నికలు ఒకేసారి నిర్వహించడమే లక్ష్యం



మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం ఎన్డీయే సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. పార్టీ నాయకుడు మోరే రవీందర్‌రెడ్డి అధ్యక్షతన ఒక దేశం ఒక ఎన్నికపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కీర్తిరెడ్డితో పాటు, జిల్లా అధ్యక్షుడు నిశిధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అనే భావన దేశంలో చాలా కాలంగా ఉన్న ప్రతిపాదన అన్నారు. ఒకే సారి ఎన్నికలు జరిగితే అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగంపల్లి ప్రసాద్ రావు, పాలసాని తిరుపతిరావు, సయ్యద్ గాలీఫ్, బట్టు రవి, దొంగల రాజేందర్, కంబాల రాజన్న, మునేందర్, తాటికంటి అనిల్ కుమార్, గీస సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

● వైద్యాధికారి వెంకటేశ్



ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): వేసవికాలంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి వెంకటేశ్ అన్నారు. సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఆలుబాక, తిప్పాపురం, బోదాపురం, మరికాల, బీసీ మల్లిగూడెం గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామ సమీపంలోని మిర్చి తోటల్లో పనులు చేస్తున్న కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేసి వడదెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పవన్, మనోహర్, సత్యనారాయణ, రామలక్ష్మి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ చేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ములుగు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్జద్ పాషా డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహాని నకల్ ఆధారంగా బ్యాంకు రుణాలు పొందిన రైతుల రుణాలను మాఫీ చేయాలని అన్నారు. రైతులకు భరోసా డబ్బులను సకాంలో చెల్లించాలని అన్నారు. వర్షాకాలంలో రైతులు సాగు చేసిన సన్నధాన్యానికి బోనస్ చెల్లించాలని అన్నారు. రామప్ప నుంచి లక్నవరం వరకు కాల్వ నిర్మాణానికి ప్రభుత్వం సేకరిస్తున్న భూములకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి నర్సయ్య, జక్కుల ఐలయ్య, సారయ్య, రమేశ్, పాణి, స్వామి, మహేందర్, సాంబయ్య, వెంకటరమణ, వెంకట్రాం, సీపీఐ నాయకులు ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

● నలుగురిపై కేసు నమోదు



డీసీఎం, బియ్యాన్ని సీజ్ చేసిన సివిల్ సప్లయీస్ అధికారులు

ఏటూరునాగారం: డీసీఎంలో తరలిస్తున్న 191 క్వింటాల రేషన్ బియ్యాన్ని ఏటూరునాగారం వద్ద జాతీయ రహదారిపై పట్టుకున్నట్లు సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్ తెలిపారు. ఏటూరునాగారం మండలం జంపన్నవాగు రెండో బ్రిడ్జి వద్ద సోమవారం వేకువజామున సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయ్ అధికారులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. ఓఎస్డీ ప్రభాకర్ మాట్లాడుతూ ఇల్లందు గుండాల మండలం నుంచి కోడిశాల, పస్రా, తాడ్వాయి ఏటూరునాగారం మీదుగా ఛత్తీస్‌గఢ్ తరలిస్తున్నారన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీరంగ సత్యనారాయణ, గుండాలకు చెందిన జంపయ్య కొనుగోలు చేసిన బియ్యాన్ని ఖమ్మం జిల్లాకు చెందిన డ్రైవర్ దమ్మంపాటి వెంకటేశ్వర్లు డీసీఎంలో తరలిస్తున్నాని చెప్పారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా సత్యనారాయణ, జంపయ్యకు చెందిన బియ్యంగా తెలిపారన్నారు. మరో క్లీనర్ పరారీలో ఉన్నాడన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లయీస్ గోదాంకు తరలించి వాహనం సీజ్ చేసినట్లు తెలిపారు. సత్యనారాయణ, జంపయ్య, వెంకటేశ్వర్లతోపాటు క్లీనర్‌పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీటీ రామ్‌చందర్‌తోపాటు సిబ్బంది ఉన్నారు.

గ్రామ గ్రామాన కంటి వైద్యశిబిరాలు



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జంపన్న

ములుగు: రానున్న రోజుల్లో నియోజవర్గంలో గ్రామ గ్రామాన ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు భూక్య జంపన్న అన్నారు. జిల్లా కేంద్రంలో జంపన్న ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో శ్రీ సత్య కంటి వైద్య నిపుణులు అఖిల్ 250 మందిని పరీక్షించి మందులను అందజేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 39 మందికి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ సత్య కంటి ఆస్పత్రికి ఆపరేషన్ నిమిత్తం పంపించారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

● తహసీల్దార్ విజయలక్ష్మి



కాటారం: దరఖాస్తులు సమర్పిస్తున్న ప్రజలు



టేకుమట్ల: దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు

టేకుమట్ల : ప్రజల సమస్యల పరిష్కరానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యాక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ అనిత కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణిని నిర్వహించారు. ప్రజావాణికి మూడు దరఖాస్తులు వచ్చాయి.

కాటారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఏడు దరఖాస్తులు రాగా, అధికారులు సైతం అంతంత మాత్రంగానే హాజరయ్యారు.

చిట్యాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆరు దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ జయశ్రీ తెలిపారు. ఐదు భూ సమస్యలు, ఒకటి విద్యుత్ సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణికి ఐదు దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి చెల్పూర్ నుంచి భూపాలపల్లి వరకు సెంట్రల్ లైటింగ్ గత కొన్ని రోజులుగా వెలగటం లేదని వెంటనే దానిని మరమ్మత్తు చేపట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే పట్టణంలోని చికెన్ మటన్ షాపులను వెంటనే కూరగాయల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన షాపులకు తరలించాలని కోరారు.

రేగొండ: మండల కేంద్రంల్లో నిర్వహించిన ప్రజావాణికి వివిధ శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంది. కాని ఐదుగురు మాత్రమే హాజరయ్యారు కాగా రెండు దరఖాస్తులు వచ్చాయి. అలాగే సమాచార లోపంతో రేగొండ మండలంలోని కనిపర్తి గ్రామానికి చెందిన ఓ మహిళ, కొత్తపల్లిగోరి మండలం బాలయ్యపల్లికి చెందిన ఓ వ్యక్తి కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీత దరఖాస్తులను స్వీకరించారు. కాగా, రెండు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.

ఏళ్లుగా తిరుగుతున్నా పట్టా కాలేదు..



వినతిపత్రం అందజేస్తున్న భార్య భర్తలు

చిట్యాల మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన బుర్ర ప్రభాకర్‌కు జూకల్ శివారులో 1.37 గుంటల భూమి ఉంది. కాగా అతడు సాగు చేస్తున్న భూమి మరోకరి మీద పట్టా అయింది. అతడి పేరు మీదుకు మార్చుకోవడానికి ఎనిమిది ఏళ్లుగా కలెక్టర్, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. ఇప్పటి వరకు తిరుగుటకు, వివిధ ఖర్చులకు సుమారు ఆరు లక్షల వరకు ఖర్చు అయినట్లు ఆయన తెలిపారు. ఏళ్లుగా తిరుగున్నా పట్టా కాలేదని ప్రజావాణిలోనైనా తమ పేరు మీద పట్టా ఇప్పించాలని అధికారులను భార్య భర్తలు ఇద్దరు కలిసి వేడుకున్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలంలో డిప్యూటి తహసీల్దార్ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో మండల కేంద్రంలోని కేవలం భూ సమస్యపైన ఒక వ్యక్తి దరఖాస్తు చేసుకున్నాడు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి




వీడ్కోలు సమావేశంలో మొగుళ్లపల్లి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

● ఎంఈఓ కుమారస్వామి

మొగుళ్లపల్లి: విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఈఓ కుమారస్వామి అన్నారు. మండలంలోని, మొగుళ్లపల్లి, మొట్లపల్లి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్ఎంపీ ప్రశాంత్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడులు, పెన్నులు, స్కేలు, పెన్సిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు పరీక్షలు రాసే విధానం గురించి వివరించి తగు సూచనలు ఇచ్చారు. విద్యార్థులు పరీక్షల్లో మెలకువలను చూపిస్తూ బాగా రాసి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ కరుణ, రమేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి లక్ష్యం ఏర్పరుచుకోవాలి

రేగొండ: ప్రతీ విద్యార్థి జీవిత లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు సూరం లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మడ్తపల్లి ఉన్నత పాఠశాలలో వీడ్కోల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ టీచర్ రాఘవులు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఉపాధ్యాయులు వనిత, రమేష్, శివప్రసాద్, యాసిన్, రియాజ్, రామ్‌మోహన్, సంజీవరావు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



రేగొండ: విద్యార్థులతో ఉపాధ్యాయులు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


● పస్రా ఎస్సై అచ్చ కమలాకర్

గోవిందరావుపేట: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండలంలోని చల్వాయి గ్రామంలోని శ్రీ రాయలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ ప్రారంభించి మాట్లాడారు. ఆలయ పరిసర ప్రాంతాలలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా ఎవరైనా అగుపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి గోవర్ధనగిరి కిరణాచార్యులు, ఆలయ కమిటీ చైర్మెన్ వీరమాచినేని వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పైడాకుల కృష్ణమూర్తి, కాసర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

● యువకుడి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి



చందు(ఫైల్)

చిట్యాల: తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్యాయత్నం చేసుకున్న యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన మేకల కొమురయ్య–హైమావతిలతో పాటు వారి కుమారుడు చందు(22) ముగ్గురు కలిసి మిరప తోటలో ఈ నెల 11న పని చేస్తున్నారు. ఈ క్రమంలో మంచిగా చదువుకుంటే ఈ ఎండ పని తప్పుతుందని కదా అని మందలించడంతో అదే రోజు సాయంత్రం ఇంటికి వచ్చి పురుగుల మందు తాగి తల్లిదండ్రులకు చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు.